క్లుప్తంగా

శాకంబరిగా దర్శనమిచ్చిన శ్యామలాంబ



సాలూరు: పట్టణంలోని శ్యామలాంబ అమ్మవారు శాకంబరి దేవిగా భక్తులకు మంగళవారం దర్శనమిచ్చారు. అమ్మవారిని శాకంబరిగా ప్రత్యేకంగా అలంకరించడంతో అధిక సంఖ్యలో భక్తులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్లు వేగవంతం చేయాలి



ఓపెన్ స్కూల్స్ పత్రికలను ఆవిష్కరిస్తున్న ఎం.సుధాకరరావు

సీతానగరం: ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్ అడ్మిషన్స్ వేగవంతం చేయాలని అసిస్టెంట్ కమిషనర్ ఫర్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్(డిప్యూటీ కమిషనర్) ఎం.సుధాకర రావు అన్నారు. ఈ మేరకు మండలకేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఇల్లా ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో ఓపెన్‌స్కూల్ సమాచారంతో కూడిన వాల్‌పోస్టర్‌ను ఆయన మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్సీ కార్యాలయం సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంటల సాగుపై ముందుగా అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఏఓ ఎస్ అవినాష్

సీతానగరం: ఖరీఫ్ పంటలు సాగు చేస్తున్న రైతులు వివిధ పద్ధతుల ద్వారా సాగుపై అవగాహన కల్పించుకుని తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించడానికి కృషి చేయాలని ఏఓ ఎస్.అవినాష్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన పెదంకలాం గ్రామంలో వరి వెద మడులలో 'పొలం పిలుస్తుంది' కార్యక్రమం నిర్వహించిన సందర్భంగా సర్పంచ్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సాగు చేస్తున్న భూములకు పట్టాలివ్వాలి

- సీపీఎం నాయకుడు పి.రాము



నిరసన ర్యాలీలో పాల్గొన్న తాన్నవలస గ్రామస్తులు, సీపీఎం నాయకులు

పార్వతీపురం రూరల్: మండలంలోని గంగాపురం పంచాయతీ తాన్నవలస గ్రామంలో గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పట్టాలివ్వాలని అనేక మార్లు విన్నవించుకున్నప్పటికీ అధికారులు స్పందన కరువైంది. కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినా సంబంధిత రెవెన్యూ అధికారులు సర్వేలు నిర్వహించి ఏడాది గడుస్తున్నా నేటికి పట్టాలు మంజూరు చేయలేదని సీపీఎం మండల నాయకుడు పి.రాము అన్నారు. ఈ మేరకు మంగళవారం తాన్నవలస గ్రామస్తులతో కలిసి నిరసన ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మహిళా నాయకురాలు పి.వరాలు తదితరులు పాల్గొన్నారు.

సందేహాలుంటే ఫిర్యాదు చేయండి

వీరఘట్టం: భూముల రీ సర్వేలో ఏమైనా సందేహాలు ఉంటే రైతులు ఫిర్యాదు చేయవచ్చునని తహసీల్దార్ కామేశ్వరరావు సూచించారు. మంగళవారం తూడి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో రైతులతో మాట్లాడారు. చిన్న చిన్న సమస్యలు ఉన్నా తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సర్వే డీటీ జి.ప్రసాదరావు, వీఆర్వోలు, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసం ప్రజలకు శాపం



బలిజిపేట: నారాయణపురంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న నాయకులు



పార్వతీపురం రూరల్: పార్వతీపురం పట్టణంలోని 1వ వార్డులో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

బలిజిపేట: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను చంద్రబాబు నెరవేర్చక పోవడం ప్రజలకు శాపంగా మారిందని, వారికి ఆర్థిక సమస్యలు తలెత్తాయని, బాబు ష్యూరిటీ పక్కా మోసమని బట్టబయలైందని బీసీ తూర్పుకాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ మామిడి శ్రీకాంత్ తెలిపారు. నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు సూచనల మేరకు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ ఆధ్వర్యంలో నారాయణపురంలో చంద్రబాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి ఇంటింటికీ తిరుగుతూ చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా నిరుపేద ప్రజలకు చేస్తున్న అన్యాయాన్ని వివరించారు.

చంద్రబాబు ఇచ్చిన హామీల పత్రాన్ని చదివి వినిపించి దీనిలో మీకు ఈ పథకాలు అందాయా? లేదా? అని అడిగి తెలుసుకుని ఇచ్చిన హామీలు నెరవేర్చని ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని తెలియజేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో చంద్రబాబు మోసాలను తెలియపరుస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సుమలత, ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, ఎంపీటీసీ రాజమోహనరావు, మేధావుల సంఘం జిల్లా అధ్యక్షుడు పీఎస్ఆర్ నాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధానకార్యదర్శి టి.ప్రసాదరావు, రాష్ట్ర వాణిజ్య విభాగం డైరెక్టర్ ఎస్.వాసుదేవరావు, మాజీ సర్పంచ్ ఎం.ప్రసాద్, డి.అప్పన్న, ఎం.శ్రీనివాసరావు, జి.గోపాల్, సర్పంచ్‌లు సుందరరావు, జి.సత్యంనాయుడు, పి.నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

28న మళ్లీ చర్చలు



డిపో వద్ద ఆందోళన చేస్తున్న అద్దెబస్సు డ్రైవర్లు, సీఐటీయూ నాయకులు

పార్వతీపురం: ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ల సమస్యలపై చర్చలు అసంపూర్తిగా ముగియడంతో ఈనెల 28న మళ్లీ డిపో మేనేజర్, అద్దెబస్సు యజమానులతో చర్చలు జరపనున్నట్లు సీఐటీయూ నాయకులు రెడ్డి వేణు, బి.వెంకటరమణ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం పార్వతీపురం ఆర్టీసీ డిపోలో అద్దె బస్సు డ్రైవర్ల యూనియన్, సీఐటీయూ నాయకులు, డిపో మేనేజర్‌తో చర్చలు నిర్వహించారు. గడిచిన 20 రోజులుగా అద్దె బస్సు డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ పరిష్కారం కాకపోవడంతో ఆందోళన బాట పట్టారు. నాలుగేళ్ల నుంచి ఆర్టీసీ డ్రైవర్ల వేతనాలు పెంచలేదని మార్కెట్ ధరలకు అనుగుణంగా వేతనాలను పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. కొన్ని బస్సుల్లో యజమానులు డ్రైవర్‌కు రూ.14వేలు, కొందరు యజమానులు రూ. 15వేలు ఇస్తున్నారన్నారు. వివిధ రకాల వేతనాలు కాకుండా అందరికీ ఒకేలా వేతనం వచ్చేలా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. చర్చల్లో డ్రైవర్లకు ఓటీ వేతనం రూ.750, డే ఆఫ్ డ్యూటీ డ్రైవర్‌కు రూ.1000, నైట్ ఆఫ్ డ్యూటీ డ్రైవర్‌కు రూ.1500 చెల్లించేందుకు యజమానులు అంగీకరించారు. మిగిలిన సమస్యలు చర్చకు రాకపోవడంతో ఈనెల 28న మళ్లీ చర్చలు జరిపించేందుకు యూనియన్ సంఘం నాయకులు నిర్ణయం తీసుకున్నారు. చర్చల్లో టీడీ ప్రసాద్, కె.వీరాచారి, ఎస్.మన్మథరావు, అశోక్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కందుల పదంలో పొలం పిలుస్తోంది



కందుల పథంలో రైతులకు సూచనలు సలహాలు ఇస్తున్న ఏఓ శిరీష

సాలూరు రూరల్:

మండలంలోని కందులపథం, మావుడి గ్రామాల్లో ఏఓ శిరీష ఆధ్వర్యంలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ శిరీష మాట్లాడుతూ వరి నాట్లు వేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు. అలాగే మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణ పద్ధతులను తెలియజేశారు. పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే ఇమామెక్టిన్ బెంజోఎట్ అనే రసాయన మందును పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. అలాగే కౌలు రైతులు కౌలు సర్టిఫికెట్ రెవెన్యూ అధికారుల నుంచి పొందాలని చెప్పారు. కార్యక్రమంలో రైతులు వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

వెదజల్లుతున్న దుర్వాసన



బాలాజీ నగర్ ప్రారంభంలో అంతర్‌రాష్ట్ర రహదారి పక్కన చెత్త కుప్పల వద్ద చేరిన వర్షపునీరు

పార్వతీపురం రూరల్: బహిరంగ ప్రదేశాల్లో చెత్త నిల్వలు పేరుకుపోవడంతో స్థానికంగా ఉన్న ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవల వర్షాలు కురవడంతో చెత్త పోస్తున్న చోట వర్షపు నీరు చేరి నిల్వ ఉండడడంతో దోమలు, అనేక రకాల కీటకాలకు ఆవాసాలుగా మారుతున్నాయి. ఇంటింటికి చెత్త సేకరణ చేపట్టి తడిచెత్త, పొడిచెత్తను వేరుచేసి ప్రకృతి సిద్ధమైన ఎరువును చెత్తసేకరణ కేంద్రాల్లో తయారు చేస్తామని చెప్పిన పాలకులు, అధికారుల వాగ్దానాలు ఆచరణలో కానరావడం లేదు. ఎక్కడ పడితే అక్కడ రహదారి పక్కన బహిరంగ ప్రదేశాల్లో కుప్పలు, తెప్పలుగా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉండి అంతర్‌రాష్ట్ర రహదారిని ఆనుకుని సాక్షాత్తు పురపాలక సంఘం ఏర్పాటు చేసిన బోర్డు వద్దే ఇలా చెత్త కుప్పలు చిందర వందరగా ఉండి దర్శనమిస్తున్నాయి.

నెలిపర్తి అంగన్వాడీ కార్యకర్తకు మెమో జారీ



అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ

సాలూరు: మండలంలోని నెలిపర్తి అంగన్వాడీ కార్యకర్త రాధకు ఐసీడీఎస్ అధికారులు చార్జ్ మెమో జారీ చేశారు. ఈ మేరకు మంగళవారం ఈ కేంద్రాన్ని ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. కేంద్రంలో చిన్నారులతో మాట్లాడారు. కాగా సాయంత్రం ఆమెకు చార్జ్ మెమో జారీ చేస్తూ 48 గంటల్లో సంజాయిషీ ఇవ్వాలని ఐసీడీఎస్ అధికారులు ఆదేశించారు. అయితే ఈ గ్రామానికి చెందిన కొందరు టీడీపీ నేతలు ఫోన్‌చేసి అంగన్వాడీ కేంద్రానికి వచ్చే సరుకుల వివరాలు ఎప్పటికప్పుడు తనకు తెలపాలని ఆమెను హెచ్చరించిన విషయం పాఠకులకు విదితమే. ఈ మెమో వెనక ప్రధాన కారణం ఇదే అయి ఉంటుందని చర్చ నడుస్తోంది.

రెండవ రోజు కొనసాగిన నిరసన దీక్షలు



దీక్షా శిబిరంలో నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజన సంక్షేమ సంఘం నాయకులు, ఆదివాసీ ఆరోగ్య సిబ్బంది

పార్వతీపురం రూరల్: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో గతంలో విద్యార్థులకు వైద్యసేవలు అందించిన ఆదివాసీ ఆరోగ్య (ఏఎన్ఎం) సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలని మంగళవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట రెండవ రోజు నిరసన దీక్షలను గిరిజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కొనసాగించారు. నిరసన దీక్షల్లో గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బందిని నియమించే వరకు తమ పోరాటం ఆగదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

కార్యక్రమంలో గిరిజన విద్యార్థి సంఘం, జిల్లా అధ్యక్షుడు పి. సురేష్, తాడంగి గణేష్, ఆదివాసీ ఆరోగ్య సిబ్బంది సుజాత, గౌరీశ్వరి, అమల, గోపాల్, కృష్ణారావు, చందు తదితరులు పాల్గొన్నారు.

కూటమి మోసాలను ఎండగడతాం

- గడపగడపకు వెళ్లి ప్రజలను చైతన్యం చేస్తాం
- మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు



బందలుప్పిలో గడపగడపకు వెళ్లి ఇంటింటికీ వంచన కరపత్రాన్ని అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు, పార్టీ నాయకులు

పార్వతీపురం రూరల్: కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిన మోసాలను ప్రజల సమక్షంలో బహిరంగంగా ఎండగడతామని పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన పార్వతీపురం మండలంలోని బందలుప్పి గ్రామంలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ ఇంటింటికీ వంచన కార్యక్రమాన్ని మండల వైఎస్సార్‌సీపీ నాయకుల నేతృత్వంలో నిర్వహించారు. ముందుగా బందలుప్పి గ్రామంలోని పలువీధుల్లో ర్యాలీ నిర్వహించి గడపగడపకు వెళ్లి ఇంటింటికీ వంచన కరపత్రాలను అందజేశారు. అనంతరం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జోగారావు గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కడుపులోఉన్న బిడ్డ నుంచి వృద్ధాప్యంలో ఉన్న వారి వరకు అనేక నూతన సంస్కరణలు చేసి వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా వారి ఇళ్లకే సంక్షేమాన్ని అందించారని ఆరోగ్య సురక్ష, గడప వద్దకే రేషన్, విద్యార్థులకు సచివాలయ వ్యవస్థ ద్వారా ధ్రువీకరణ పత్రాలు వంటి ఎన్నో సేవలు ప్రజలకు అందిస్తే అబద్ధపు హామీలతో ప్రజలను వంచన చేసి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని మరుగున పడేసిందన్నారు. గ్రామంలో మేము తట్టిన ప్రతి గడపలో సంక్షేమం అన్న మాటే లేదన్నారు. ఇప్పటికైనా కూటమి పాలకులు రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని పక్కన పెట్టి ప్రజాపాలనపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, ఎంపీపీ మజ్జి శోభారాణి, జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, వైస్ఎంపీపీలు సిద్ధా జగన్నాథం, బి.రవికుమార్, సర్పంచ్ యాళ్ల ప్రమీల దేవి, ప్రతాప్, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి ముప్పల సత్యంనాయుడు, రాష్ట్ర అనుబంధ విభాగాల కార్యదర్శులు వాసుదేవరావు, శివాజీ, నియోజకవర్గ విభాగాల నాయకులు నాగేశ్వరరావు, మజ్జి శేఖర్, సిహెచ్ ప్రసాద్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సీతానగరం: బాబు ష్యూరిటీ..మోసం పక్కా గ్యారంటీపై చినంకలాం గ్రామంలో ప్రజలకు వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సాగునీరు విడుదలకు సిద్ధం



ప్రాజెక్ట్ వద్ద స్టోరేజ్ చేసిన నీరు

సీతానగరం/మక్కువ: మండలంలోని సువర్ణముఖి నదిపై ఉన్న సీతానగరం సాగునీటి ప్రాజెక్ట్ ద్వారా నీరు విడుదల చేయడానికి ఇరిగేషన్ ఇంజినీరింగ్ అధికారులు సన్నద్ధం చేస్తున్నారు. సీతానగరం సాగునీటి ప్రాజెక్ట్ పరిధిలో నీటి వనరులున్నా వర్షాభావ పరిస్థితుల కారణంగా కొత్తవలస వద్ద నీరు నిల్వ ఉంచడానికి నీరు అరకొరగా ఉన్నందున ఇంతవరకూ నీరు విడుదల చేయలేదు. నాలుగు రోజులుగా ఒడిశా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు వరద నీరు వచ్చి చేరుతున్నందున డామ్ షట్టర్లు మూసి వేయడంతో నీరు చేరింది. స్థానికంగా వర్షాలు లేక పోవడంతో అరకొరనీటితో నాట్లు వేస్తున్నా ఇబ్బందులు వస్తున్నాయని రైతులు అంటున్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా సుమారు 4 వేల ఎకరాలకు సాగు నీరు సరఫరా చేయాల్సి ఉంది. పనులు ఇపుడిప్పుడే జరుగుతున్న కారణంగా పూర్తి స్థాయిలో సాగునీరు పంపిణీ ప్రశ్నార్థకమేనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కమ్యూనిస్టు ఉద్యమానికి తీరనిలోటు



ప్రజా సంఘాల కార్యాలయంలో నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

బలిజిపేట: కేరళ మాజీ ముఖ్యమంత్రి వీఎస్ అచ్యుతానందన్(101) మృతి సీపీఎం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరనిలోటని సీపీఎం మండలశాఖ సీనియర్ నాయకులు మన్మథరావు, జి.సత్యనారాయణలు అన్నారు. ఈ మేరకు బలిజిపేట ప్రజా సంఘాల కార్యాలయంలో అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అచ్యుతానందన్ కేరళలో ఒక పేదరిక కుటుంబంలో జన్మించి కార్మిక ఉద్యమం నుంచి ప్రజానేతగా ఎదిగారన్నారు. బాల్యంలో పేదరికం కారణంగా ప్రాథమిక స్థాయిలోనే విద్యను ఆపివేసి కొబ్బరి పీచు ఫ్యాక్టరీలో పనిచేస్తూ జీవనం సాగించారన్నారు. ఎన్నో ఉద్యమాల్లో పాల్గొని వెనుకంజ వేయకుండా ప్రజల తరపున పోరాడిన నాయకుడని కొనియాడారు. కార్యక్రమంలో వెంకటస్వామి, సత్యం, బి.భానుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

జ్వరాలతో బాధపడుతున్న దబ్బగెడ్డ



జ్వరంతో బాధపడుతున్న రోగి

మక్కువ: మండలంలోని దబ్బగెడ్డ గ్రామంలో పలువురు రోగులు తలనొప్పి, కండరాల నొప్పి, జ్వరంతో బాధపడుతున్నారు. ముఖ్యంగా ఒళ్లు నొప్పులతో బాధపడుతూ పలువురు మంచానపడ్డారు. ఒళ్లు నొప్పులు అధికంగా ఉండడంతో, చికున్ గున్యా ఏమోనని గ్రామస్తులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. రెండురోజుల క్రితం సత్యసాయి సేవాట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు రోగులను పరీక్షించి, జ్వరాలతో, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్నట్లు గుర్తించారు. ప్రభుత్వం వైద్యశిబిరం నిర్వహించకపోవడంతో, ప్రైవేట్ వైద్యులను ఆశ్రయించాల్సి వస్తుందని రోగులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సచివాలయాల ద్వారా యూరియా అందించాలి



కోడికాళ్ల వలస రైతు భరోసా కేంద్రం వద్ద నిరసన తెలియజేస్తున్న సీపీఎం నాయకుడు కోరాడ ఈశ్వరరావు, రైతులు

పాచిపెంట: గ్రామ సచివాలయాల ద్వారా రైతులకు యూరియా అందించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కోరాడ ఈశ్వరరావు డిమాండ్ చేశారు. సకాలంలో రైతులకు యూరియా అందించాలని కోరుతూ మంగళవారం మండలంలోని కోడి కాళ్లవలసలో రైతులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మాదిరిగా సచివాలయాల ద్వారా అందుబాటులో ఉన్న రైతులందరికీ యూరియా అందించి వ్యవసాయ రంగాన్ని కాపాడాలని ప్రైవేట్ వ్యాపారుల నుంచి రైతులు ఇబ్బంది పడకుండా చూడాలన్నారు. పూర్తిస్థాయిలో ఎరువులు అందించకుండా ప్రభుత్వం బాధ్యతారహితంగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో రైతులు జి.సూర్యనారాయణ అంబురాజు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రైమరీ పాఠశాలల పరిశీలన



మాట్లాడుతున్న ఎంఈఓ ఎం.వెంకట రమణ

సీతానగరం: మండలంలోని పాఠశాలల్లో మౌలికవసతున్నాయా? లేదా? అనే అంశాలపై అధ్యయనం చేయడానికి పాఠశాలలను సందర్శిస్తున్నామని ఎంఈఓ-1 జి.సూరిదేముడు, ఎంఈఓ-2 ఎంవీ రమణ అన్నారు. ఈ మేరకు చినభోగిలి, సీతానగరంలో పాఠశాలలను మంగళవారం సందర్శించిన ఎంఈఓలు మాట్లాడుతూ విద్యాబోధన, విద్య నభ్యసించడానికి ఉపాధ్యాయులు, విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం ఈ పరిశీలనలో భాగమన్నారు. అన్ని పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించనున్నామని పాఠశాలల్లో ఉన్న రిక్వైర్ మెంట్‌ను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నామన్నారు. పాఠశాలలల్లో గుర్తించిన పనులకు ప్రతిపాదనలు తయారుచేసి జిల్లా విద్యాశాఖకు నివేదిక సమర్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ సహాయకులు, ఎస్ఎంసీ కమిటీ చైర్మన్‌లు, పేరెంట్స్ పాల్గొన్నారు.

ప్రకృతివ్యవసాయంపై మక్కువ చూపించాలి



ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులకు వివరిస్తున్న ఏవో భారతి

మక్కువ: ప్రకృతి వ్యవసాయం సాగుపై రైతులు మక్కువ చూపించాలని వ్యవసాయాధికారి చింతల భారతి కోరారు. ఈ మేరకు మండలంలోని పనసభద్ర గ్రామంలో మంగళవారం ఏవో భారతి ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగం తగ్గించి, సేంద్రియ ఎరువుల వినియోగంపై రైతులు దృష్టిసారించాలని సూచించారు. ప్రకృతిసేద్యం ద్వారా పండించిన పంటలు, ఆరోగ్యకరమైనవన్నారు. పంటలకుసోకే కాండంతొలిచే పురుగు, కాయతొలిచే పురుగు, రసంపీల్చే పురుగు నివారణకు ప్రకృతివ్యవసాయ పద్ధతి ద్వారా దశపర్ని కషాయం తయారుచేసి, పిచికారీ చేస్తే పురుగు నివారించుకోవచ్చునని తెలిపారు. ఖరీఫ్‌సీజన్‌లో రాగిపంట సాగు విస్తీర్ణం పెంపొందించేందుకు రైతులకు అవగాహన కల్పిస్తున్నా మన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.